## భారతీయ కళలను మరవొద్దు

**మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

శేరిలింగంపల్లి, డిసెంబర్ 29 : పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను మరవొద్దని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి గచ్చిబౌలి బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో రామినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రవాసాంధ్రురాలు కుమారి శ్రీద వరాలి చదలవాడ కూచిపూడి అరంగేట్రం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరభాషలో ప్రావీణ్యం సంపాదించాల్సిన అవసరం ఉన్నప్పటికీ మాతృభాషను మాత్రం మరవొద్దన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ప్రముఖ శాస్త్రవేత్త సతీశ్ రెడ్డి, కేంద్ర మాజీ విజిలెన్స్ కమిషనర్ కేవీ చౌదరి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## జీహెచ్‌ఎంసీలో రెండో రోజు 4.98 లక్షలు..

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ప్రజా పాలనలో భాగంగా జీహెచ్ ఎంసీ వ్యాప్తంగా రెండో రోజు ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. పలు సర్కిళ్లలో ఏర్పాటు చేసిన కౌంటర్లను ఎంపీలు, ఎమ్మెల్యేలు సందర్శించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. మరోవైపు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ క్యూలైన్లపై ఆరా తీస్తూ.. డీసీలకు పలు సూచనలు చేశారు. కౌంటర్ల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా, మొదటి రోజు 1,98,009 దరఖాస్తులు కలుపుకొని మొత్తం 6,96,437 వచ్చాయి.

| జోన్ | స్వీకరించిన దరఖాస్తులు |
|---|---|
| చార్మినార్ | 1,15,418 |
| ఖైరతాబాద్ | 77,532 |
| కూకట్‌పల్లి | 95,188 |
| ఎల్బీనగర్ | 69,393 |
| సికింద్రాబాద్ | 86,902 |
| కంటోన్మెంట్ | 10,282 |
| శేరిలింగంపల్లి | 43,713 |
| | 4,98,428 |

### మేడ్చల్‌లో 77,605 దరఖాస్తుల స్వీకరణ

మేడ్చల్, డిసెంబర్29(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, మండలాల పరిధిలో రెండు రోజులకు గాను 77,605 దరఖాస్తులను స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

## నేడు జల్నా-ముంబై వందేభారత్‌ను ప్రారంభించనున్న ప్రధాని

సిటీబ్యూరో, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ): భారతీయ రైల్వే ఆధ్వర్యంలో శనివారం జల్నా - ముంబై రైల్వే స్టేషన్ల మధ్య మొదటి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. అందుకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ప్రధాని అయోధ్య నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెండా ఊపి ప్రారంభించనున్నారు. అలాగే, విజయవాడ రైల్వే డివిజన్ మీదుగా మల్దా టౌన్-ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ (బెంగళూరు) అమృత భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

**ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ రెడ్డి**




జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ ర్యాలీలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 29 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ కళాశాలలో విద్యార్థులు సోదరభావంతో కలిసిమెలిసి చదువుకోవాలని... తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం వర్సిటీ కళాశాల ఆవరణలో యాంటీ ర్యాగింగ్ డే సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ర్యాగింగ్ చేయాలన్న ఆలోచన రావడం నేరమని, తోటి విద్యార్థులను మాటలు, చేష్టలతో వేధించడం సరికాదన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కేసు నమోదు చేయడంతో పాటు కళాశాల నుంచి శాశ్వతంగా అడ్మిషన్‌ను రద్దు చేస్తామని తెలిపారు. విద్యార్థులు కళాశాలలోని వసతులను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫార్మాసిటీని రద్దు చేస్తే

# ఆ భూములను రైతులకే ఇవ్వాలి

**ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి**

**గ్రామ సభల్లో కాంగ్రెస్ పార్టీ బ్యానర్లు కడితే ఊరుకోం**

**కందుకూరు కృతజ్ఞత సభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి**



కందుకూరు కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, డిసెంబర్ 29 : ఫార్మాసిటీని రద్దు చేస్తే తిరిగి ఆ భూములను రైతులకే ఇవ్వాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడి డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు హాజరయ్యారు. అంతకు ముందు హైదరాబాద్, శ్రీశైలం రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ... కందుకూరు వరకు మెట్రో తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఫార్మాసిటీ, మెట్రోను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం భావ్యం కాదన్నారు. ప్రజాపాలనలో ప్రజలు తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గ్రామ సభల్లో కాంగ్రెస్ పార్టీ బ్యానర్లను కడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో రైతుబంధును ఆపారని, ఇప్పుడు రైతులకు వేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. అన్ని పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికమని చెప్పి ఎందుకు రేషన్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తరచూ అప్పులంటూ ఆరు గ్యారంటీలు, హామీలను పక్కన పట్టడానికి ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మెగా సిటీ వస్తే యువకులకు ఉద్యోగాలు వస్తాయా ? అని అడిగారు. ప్రభుత్వం హామీలను నెరవేర్చకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, జడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మీనర్సింహా రెడ్డి, అంజయ్యగౌడ్, బాలకృష్ణ, అధ్యక్షురాలు ఇందిరమ్మ, నాయకులు దేవేందర్, అమరేందర్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, యూత్ నాయకులు కార్తిక్, విఘ్నేశ్వర్‌రెడ్డి, దీక్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం మూసేశారని

# వినియోగదారుల ఆందోళన

***సర్వర్ డౌన్ కావడంతోనే..***

***భారత్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది***



సుష్మా చౌరస్తా సమీపంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ ఎదుట ఆందోళన చేస్తున్న వినియోగదారులు

మన్సూరాబాద్, డిసెంబర్ 29: కేవైసీ చేయించుకునేందుకు వస్తే అర్ధాంతరంగా కార్యాలయాన్ని మూసేసి వెళ్లారంటూ భారత్ గ్యాస్ ఏజెన్సీ ఎదుట వినియోగదారులు ఆందోళనకు దిగారు. కేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యాస్ సబ్సిడీ రూ. 500 పథకం వర్తిస్తుందని ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన కథనాలతో గ్యాస్ ఏజెన్సీల ఎదుట ప్రజలు బారులు తీరుతున్న విషయం తెలిసిందే. ఇలాంటి వదంతులతో తమ కనెక్షన్లను కేవైసీ చేయించుకునేందుకు, ఇతర సమస్యలతో సుష్మా చౌరస్తా సమీపంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి శుక్రవారం ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం 12:45 గంటల సమయంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కార్యాలయాన్ని మూసేసి వెళ్లిపోయారు. భోజనానికి వెళ్లి ఉంటారేమోనని వినియోగదారులు సాయంత్రం 4 గంటల వరకు కార్యాలయం ఎదుట కూర్చున్నారు. ఎంతకూ తెరవకపోవడంతో ఆందోళనకు దిగారు. ఈ విషయంపై భారత్ గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యాన్ని ఫోన్ ద్వారా వివరణ కోరగా... ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు వినియోగదారులకు కేవైసీ చేశామని, ఒక్కసారిగా సర్వర్‌డౌన్ కావడంతో తిరిగి కంప్యూటర్లు పని చేయలేదన్నారు. సర్వర్ డౌన్ అయ్యిందని చెప్పినప్పటికీ వినియోగదారులు తమతో వాదనకు దిగి కార్యాలయంలోకి చొచ్చుకొచ్చారని, తప్పనిసరి పరిస్థితిలో కార్యాలయాన్ని మూసివేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. శనివారం నుంచి యథావిధిగా కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు.

## కొత్త చట్టాలపై తరగతులు ఏర్పాటు చేయాలి

నాంపల్లి కోర్టులు, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ) : పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరంలో న్యాయవాదులందరూ ఆనందంగా జీవించాలని నాంపల్లి కోర్టుల ఇన్‌చార్జి, జిల్లా జడ్జి ప్రేమావతి స్పష్టం చేశారు. శుక్రవారం నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో నూతన చట్టాల అమలు గురించి న్యాయవాదులందరికీ ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేయాలని సూచించారు. మెజిస్ట్రేట్లు, జడ్జిలు సైతం ఈ తరగతులకు హాజరు కావాలన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌తో పాటు న్యాయవాదుల డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జిలు భూపతి, రమాకాంత్, ఈశ్వరయ్య, చంద్రశేఖర్‌రావు,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి షావుకారి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

## నేడు జాతీయ లోక్ అదాలత్

నాంపల్లి కోర్టులు, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : కేసుల పరిష్కారానికి మూడు నెలలకోసారి నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను నాంపల్లి కోర్టుల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఉదయం జాతీయ లోక్‌అదాలత్‌ను న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లాజడ్జి ప్రేమావతి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కక్షిదారులకు ఇబ్బందులు కలుగకుండా భోజన వసతిని సైతం ఏర్పాటు చేశామని, రాజీ చేసుకునేందుకు మంచి అవకాశమని తెలిపారు. వివాహ సంబంధ, చెక్ బౌన్స్, ఎక్సైజ్, ఐపీసీ సెక్షన్ల కింద రాజీ చేసుకోవడానికి సువర్ణ అవకాశమని వెల్లడించారు. లోక్ అదాలత్‌లో అధిక కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, మెజిస్ట్రేట్లు చేయూతనందించాలని కార్యదర్శి కోరారు.

# మున్సిపాలిటీల్లో పన్నుల వసూలే లక్ష్యం

***రూ.190 కోట్లు.. ప్రత్యేక బృందాలు***

మేడ్చల్, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ): మున్సిపాలిటీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రూ.190 కోట్ల పన్ను వసూళ్లు చేసేందుకు అధికారులు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. జిల్లాలో పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లు కాగా.. మేడ్చల్, నాగారం, తూంకుంట, దమ్మాయిగూడ, గుండ్లపోచంపల్లి, ఘట్‌కేసర్, పోచారం, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలు. మున్సిపాలిటీల్లో నివసించే ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు పన్ను వసూళ్ల పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

**ఇప్పటి వరకు రూ.112 కోట్లు వసూలు..**

జిల్లాలోని 13 మున్సిపాలిటీల్లో ఇప్పటి వరకు రూ.112 కోట్ల పన్నులను వసూలు చేశారు. అయితే మరో రూ. 78 కోట్ల వసూలు చేసేందుకు అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మార్చి 31 వరకు వంద శాతం పన్నులను వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు బకాయిలు ఉన్న ఇంటింటికీ తిరిగి పన్ను వసూలుకు చర్యలు తీసుకుంటూ..మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. కాగా, ఆర్థిక సంవత్సరం నాటికి పన్ను చెల్లించని వారికి బకాయిలపై 2 శాతం వడ్డీ విధించనున్నారు.

**పన్నులు చెల్లించి..అభివృద్ధికి సహకరించండి**

ఆస్తి పన్నులు చెల్లించి మున్సిపాలిటీల అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్లు ప్రజలను కోరుతున్నారు. సకాలంలో ఆస్తి పన్నులు చెల్లిస్తే మున్సిపాలిటీల్లో నివసించే ప్రజలకు సౌకర్యాలను కల్పించేలా నిధులను వినియోగించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఏడాది పెరుగుతున్న బకాయిలతో అభివృద్ధి పనులకు ఆటంకం జరుగుతున్న దృష్ట్యా బకాయిదారులు వెంటనే పన్నులు చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.